క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పెనుగంచిప్రోలు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎస్ఎస్‌పీఎం బాలికల జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం కలుషితమైతే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, ఏపీఓ జనార్దనరావు, హెచ్ఎం నక్కా బాబూరావు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

మొక్క విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షిస్తే భావితరాల వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో నితిన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనం–మనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సచివాలయంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని, అందుకు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మొక్కల విలువలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఏపీవో రామకృష్ణ, గ్రామ నాయకులు అశోక్, శ్రీనివారావు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పెనుగంచిప్రోలు: దైనందిన జీవితంలో నిత్యం యోగా చేయటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం రెండవ రోజు ఉపాధ్యాయులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సౌజన్యశ్రీ యోగాసన, ప్రాణాయామం, ధ్యానం గురించి వివరించటంతో పాటు వాటి ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, పీడీ బాబూప్రసాద్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



వత్సవాయి: కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావు అన్నారు. ఈమేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ జనార్దనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు కౌలు వ్యవసాయం చేస్తున్నారని, గత సంవత్సరం మిర్చి పంటకు ధర లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు లేక పోవటంతో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పంట నష్ట పరిహారం అందలేదన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి ఆ సభలో కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు



చందర్లపాడు(నందిగామ రూరల్): పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీనియర్ శాస్త్రవేత్త రాజప్ప అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలం పొక్కునూరు, కాసరబాద గ్రామాలలో గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయం, నూతన వంగడాలు, పచ్చిరొట్ట ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సంతర్భంగా ఆయా గ్రామాలలో మొక్కలు నాటారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- కంచికచర్ల, పేరకలపాడు కంచిలమ్మ, ఊర చెరువుల్లో మట్టి అక్రమంగా తరలింపు
- నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల అండతో తెగబడుతున్న మట్టి మాఫియా ప్రతినిధులు
- వెంచర్లకు అక్రమంగా తరలిస్తున్న చెరువు మట్టి
- పెద్ద పొక్లెయిన్‌లతో లోతుగా తవ్వకాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కంచికచర్ల మండలం పేరకలపాడు ఊర చెరువులో మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్

కంచికచర్ల:నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో కృష్ణా, మునేటి పరివాహక గ్రామాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతుంటే, పచ్చని పల్లెల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. అధికారుల అలసత్వాన్ని ఆసరా చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియాకు ఇప్పుడు మట్టి మాఫియా కూడా తోడవటంతో ప్రకృతి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతుంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని కంచికచర్ల, పేరకలపాడు, పరిటాల, గొట్టుముక్కల గ్రామాల పరిధిలోని చెరువు నుంచి కూటమి నేతలు, అక్రమార్కులు ఇష్టారీతిన మట్టి తోలకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు.

లక్షలు కొల్లగొడుతున్న తెలుగు తమ్ముళ్లు...

ప్రకృతి సంపదను దోచుకునేందుకు కూటమి నేతలు అక్రమార్గనకు తెర తీశారు. చెరువులు, కుంటల్లో మట్టిని విక్రయిస్తూ అక్రమార్జనతో తెలుగు తమ్ముళ్లు లక్షలు కొల్లగొడుతున్నారు. కంచికచర్ల, పేరకలపాడు, పరిటాల గ్రామాల్లో చెరువులో పొక్లెయిన్ వంటి భారీ యంత్రాలను ఉపయోగించి రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్‌లతో మట్టిని తవ్వుతున్నారు. కంచికచర్ల కంచలమ్మ చెరువునుంచి మట్టిని తవ్వి వీరులపాడు మండలంలోని పొన్నవరం, ఎస్.అమరవరం రోడ్డులోని వెంచర్లకు యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులో మట్టిని లోడ్ చేసేందుకు ట్రక్కు మట్టిని రూ.1000 నుంచి రూ.1,500 నుంచి వరకు విక్రయిస్తూ అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు.



ట్రాక్టర్ ద్వారా వెంచర్లకు అక్రమంగా తరలిపోతున్న మట్టి

అనుమతులు లేకుండా తవ్వకాలు

ఎటువంటి అనుమతులు లేకుండా పేరకలపాడు ఊర చెరువులో భారీ గోతులు పెట్టి మట్టిని తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో నీటిని తాగేందుకు చెరువులోకి దిగిన మూగజీవాలు సైతం భారీ గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తోలుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయటంతో పాటు మట్టి రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెరువుల్లో అనుమతులు లేకుండా తవ్వితే చర్యలు

కంచికచర్ల, పేరకలపాడు, గొట్టుముక్కల చెరువుల్లో మట్టి తవ్వుతున్నారని సమాచారం వచ్చింది. మట్టి తవ్వకాలు జరిపేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తవ్వితే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పొక్లెయిన్, ట్రాక్టర్లను కూడా సీజ్ చేస్తాం.

– రాజేష్ , ఇరిగేషన్ ఏఈ, కంచికచర్ల

శాస్త్రోక్తంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



వెల్లంకిలో ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామం గురువారం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన గోదా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహ, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్టా మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుడు సీతారామానుజాచార్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం 6.26 గంటలకు ప్రతిష్టా మహోత్సవాలను వైభవంగా జరిపించారు. ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. వీరులపాడు మండలంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నెమలిపురి ప్రసాదరావు, గ్రామ పెద్దలు నెమలిపురి వాసు, ప్రసాద్, చంద్ర సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ తయారీలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగామ రూరల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ, ఆప్‌కాస్ట్ (ఏపీసీవోఎస్‌టి) రీజనల్ సైన్స్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో ఎండింగ్ గ్లోబల్ ప్లాస్టిక్ పొల్యూషన్ అంశంపై నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీల్లో ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు బుడ్డి నరేంద్ర తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలో పాఠశాలకు చెందిన జమ్ముల వర్షిణి, బెల్లంకొండ జయ శ్రీలక్ష్మి, యార్లగడ్డ భార్గవ్ ప్రతిభ కనబర్చటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు ఆప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ శరత్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి హుసేన్ ప్రశంసాపత్రాలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల గైడ్ టీచర్ బండారు లక్ష్మీనారాయణ, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటిన ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్



నందిగామ ఆర్డీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో బాలకృష్ణ తదితరులు

నందిగామటౌన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటటం వల్ల గ్లోబల్ వార్మింగ్ వంటి ఉపద్రవాలను అరికట్టవచ్చన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలని మొక్కలను నాటటమే కాకుండా వాటిని పరిరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిసనర్ రమణబాబు గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మున్సిపల్ పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



కీసర జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతున్న సీఐ చవాన్, టోల్‌ప్లాజా సీఓఎం రాజారావు

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేటఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విధిగా తమ గృహాల వద్ద మొక్కలు నాటాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ చిల్డ్రన్ పార్కులో నిర్వహించిన వన మహోత్సవం –2025లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలసి ఎమ్మెల్యే తాతయ్య పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, నకిరికంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు, నాయకులు కాటగాని నరసింహారావు, పూసల పుల్లారావు, గోగుల సీతారాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటండి

కీసర(కంచికచర్ల): వాహనాల ద్వారా ప్రతిరోజు కాలుష్యం వెదజల్లుతోందని, కాలుష్య నియంత్రణ కోసం మొక్కలు నాటాలని నందిగామ రూరల్ సీఐ దేవ్ చవాన్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కీసర జాతీయ రహదారి పక్కన గురువారం 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్వర్ణ టోల్‌వేస్ ప్లాజా సీఓఎం రాజారావు, టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్, ఐఈ బాలాజీశర్మ, విజయదీపక్, శివశంకర్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



కంచికచర్లలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

కంచికచర్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఇందుపల్లి నానిబాబు అన్నారు. మండలం లోని పరిటాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయంలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఏపీఓ రమాదేవితో పాటు పలువురు అధికారులు గురువారం మొక్కలు నాటారు. కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వత్సవాయి: మండలంలోని మంగొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్లు నరకటం, మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాల నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగొల్లు గ్రామంతో పాటు రైల్వే స్టేషన్, ఆర్‌డబ్ల్యూయస్ పథకానికి కలిగే విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

నందిగామరూరల్: మొక్కలు నాటటం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో ఆ పార్టీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, బీజేపీ నాయకులు మునగంటి కామేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వెంకట సత్యనారాయణ గుప్త, స్వామి, చంద్రశేఖర్, సత్యనారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

నందిగామరూరల్: ప్రభుత్వం రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ అశ్వని అన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలను గ్రామ నాయకులతో కలిసి గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగ విత్తనాలను 10 కిలోల బ్యాగు రూ.1230 ఉండగా 50 శాతం రాయితీపై రూ.615కే అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 15 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని, అవసరమైన రైతులు విత్తనాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, చెరుకూరు మధుసూదనరావు, బోడేపూడి శ్రీహరి, బెల్లంకొండ బాబు, తిరుపతిరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

యోగాసనాలతోనే ఆరోగ్యం

నందిగామటౌన్: యోగా సాధనతో ఏకాగ్రత అలవడుతుందని, శారీరక, మానసిక ప్రయోజనాలు కలుగుతాయని యోగా గురువు గాడిపర్తి సీతారామారావు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలోని విద్యార్థులకు గురువారం యోగా సాధనపై అవగాహన కలిగించి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మస్తాన్ వలి, విద్యార్థులు పాల్గొన్నారు.


యోగాతో ఏకాగ్రత

కంచికచర్ల: స్థానిక విశ్రాంత సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువు అర్లప్ప గురువారం విశ్రాంత ఉద్యోగులకు యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రతిరోజు యోగాసనాలు వేయటం వల్ల రోగాల బారినుంచి తప్పించుకోవచ్చని అన్నారు. అనంతరం విజయవాడకు చెందిన మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు, కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి చలసాని నాగేశ్వరరావు, బొల్లం కృష్ణమూర్తి, సర్వేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, పెద్దినీటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

జగ్గయ్యపేటఅర్బన్: ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి గొట్టిపోళ్ల సురేష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆధార్ కేంద్రాలను గాలికి వదిలేసిందని తెలిపారు. నియోజకవర్గం మొత్తంలో ఒకటి, రెండు కేంద్రాలతో సరిపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆధార్ నమోదు చేయించుకోవాలంటే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నమోదుచేయించుకోవాల్సి వస్తోందన్నారు. అది కూడా ఒక్కరోజులో కాకుండా రెండు మూడు రోజులు జాప్యం జరగడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆధార్ గానీ, ఏ సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయాల ద్వారా వలంటీర్లు ఇంటి వద్దకే తీసుకుని వచ్చేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసి ప్రజలకు నరకయాతన చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఆధార్ సెంటర్లను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటుచేయాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

చిత్రలేఖనం పోటీలో పేట విద్యార్థుల ప్రతిభ



విజ్ఞాన్ స్కూల్‌కు చెందిన వై.తేజస్వినికి బహుమతి అందజేస్తున్న డీఈవో సుబ్బారావు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్ష , యాప్‌కాస్ట్(ఏపీసీవోఎస్‌టీ) వారి సహకారంతో విజయవాడ రీజనల్ సైన్స్ సెంటర్‌లో ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే అంశంపై గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారికి నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో జగ్గయ్యపేటకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు చెందిన చందా అక్షయ, నాగి శ్యామశ్రీ, విజ్ఞాన్ పాఠశాలకు చెందిన 6 వ తరగతి విద్యార్థిని వై.తేజస్విని, తపోవనం పాఠశాలకు చెందిన చెరుకూరు సాహితి ప్రథమ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు, యాప్‌కాస్ట్ సెక్రటరీ డాక్టర్ జి.శరత్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎం.హుస్సేన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. జెడ్పీ బాలికల హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు ఇండ్ల వెంకట రమణ, హెచ్ఎం కె.హేమామాధవి విద్యార్థులను అభినందించారు. విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి విద్యార్థిని యాటగిరి తేజస్వినిని అభినందించారు.

విద్యుత్ షాక్‌తో కార్మికునికి తీవ్ర గాయాలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణం సమీపంలోని షేర్ మహ్మద్‌పేట క్రాస్ రోడ్ వద్ద విద్యుత్‌శాఖకు సంబంధించిన ఆర్‌డీఎస్ఎస్ స్కీం పనుల్లో భాగంగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రోజువారీ కాంట్రాక్టు కార్మికుడు బీర్ సింగ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తాకడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించాలని నిర్ణయించారు.

ఐకమత్యంగా బక్రీద్ వేడుకలు జరుపుకోవాలి

ముస్లిం పెద్దలతో పోలీసుల సమావేశం




పేట పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్ఐ రాజు

జగ్గయ్యపేటఅర్బన్: రానున్న బక్రీద్ పండుగ రోజున గోవులను వధించడం విషయంలో చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు చేయవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జి.రాజు స్థానిక ముస్లిం పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బక్రీద్ పర్వదినం రోజున ఎటువంటి చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించారు. ఎటువంటి వివాదాలకు తావులేని విధంగా అందరూ ఐకమత్యంగా, ఆనందోత్సాహాలతో పండుగ చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలు

కంచికచర్ల: గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఆంగ్లభాష, పుస్తక పఠనం నేర్పించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు బీడీసీ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట మున్సిపల్ ఎఫ్ఏసీ కమిషనర్‌గా డీఈఈ కలీముల్లా



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు మే నెల 31 వ తేదీన ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మున్సిపల్ డీఈఈ కలీముల్లాను ఫుల్ అడిషనల్ చార్జ్ కమిషనర్‌గా పురపాలక శాఖ నియమించింది. అయితే ఇప్పటికే టీడీపీ స్థానిక అధినాయకత్వం, మున్సిపల్ పాలకవర్గం డీఈఈ కలీముల్లాపై తీవ్ర అసంతృప్తితో ఉండటంతో ఆయనను బదిలీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. పురపాలక సంఘ నిబంధనల ప్రకారం మున్సిపల్ కమిషనర్ తరువాత మున్సిపల్ కార్యాలయంలో డీఈఈకే అవకాశం కల్పించడంతో ప్రస్తుతం ఉన్న డీఈఈ కలీముల్లాను ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మైలవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు చదివించి, వారి జీవిత చరిత్రను చెప్పించారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర–స్వర్ణాంధ్ర అంశంపై వ్యాసరచన, ఇన్‌డోర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. సినీ గేయ పోటీలు జరిగాయి. న్యాయనిర్ణేతలుగా స్థానిక విశ్రాంత ఉద్యోగి డీవీ ప్రసాద్ వ్యవహరించారు.